# పుస్తక పరిచయం




K.Balakrishna Reddy
F6, Satya Parvathi Apts,
Lawerpet,
ONGOLE
Phone: 08592-239632

**తెలుగులో** స్మృతికావ్యాలు చాలా తక్కువ. ప్రాణంలో ప్రాణమై, జీవితంలో సగభాగమై బ్రతికిన ఇల్లాలు కళ్ళముందే పరలోకానికి వెళ్ళిపోయినప్పుడు కన్నీరు కవిత్వమై స్రవిస్తే రూపుదిద్దుకున్నవే స్మృతికావ్యాలు. వీటిలో ముఖ్యమైనవి విశ్వనాథ వారి ‘వరలక్ష్మీ త్రిశతి‘, దువ్వూరి రామిరెడ్డి గారి ‘భగ్నహృదయము‘, రావూరి భరద్వాజ గారు తన భార్య గురించి వ్రాసిన కావ్యం. ఈ కోవకు చెందినదే ఈ సుదీర్ఘ కవితా కావ్యం ‘నువ్వు లేని నేను‘. కె.బాలకృష్ణారెడ్డిగారు స్వత హాగా మధురకవి. సున్నితమైన భావాలతో అందమైన పద చిత్రాలతో ‘పుప్పొడి రాలిన చప్పుడు‘, ‘రా..ఇలా కోయిలా‘ అనే గేయ కవితా సంపుటాలని వెలువరించారు. ఐతే 2001 జూన్ నెల 26 వతేదీ రాత్రి వారి గ్రామంలో జరిగిన దోపిడి దొంగల భీభత్సంలో అనురాగమయి ఐన అర్ధాంగిని కోల్పోయిన కె.బాలకృష్ణారెడ్డి గారి హృదయవేదన, ఆత్మ నివేదన ఈ దీర్ఘ కవితగా రూపుదిద్దుకుంది. ‘చీకటి ముసిరిన కానలో ఒక వేకువ వికసించునా / గుండెను కోసే జ్ఞాపకాలతో ఓ కావ్యం రాయనా..‘ అంటూ స్వర్గీయ రాజేశ్వరిగారిని అడిగినట్లుగా కవిత్వాన్ని సాగిస్తారు రచయిత. ఈ సుదీర్ఘకవిత కేవలం రచయిత మనోవేదనకి దర్పణం మాత్రమే కాక, చదువరుల మనసుని తాకే విషాద వీచికా సంచయంగా అనిపిస్తుంది. పుస్తకం చదవడం పూర్తయే సరికి మనసు బాధతో బరువెక్కుతుంది. "కొన్ని పాటలు నన్ను నిలదీస్తున్నాయి / నా గుండెను నిలువునా కోస్తున్నాయి / నీ కిష్టమైన పాట / నీ కోసం నా కలం కురంగమై / గంతులేసిన పాట.." - "ఎలాగైనా నిన్ను చేరుకోవాలని / అనుకుంటే ఎంత నిరాశ / నిన్ను చేరుకోవడం కోసం / ఎప్పుడు ఆగిపోతుందో ఈ శ్వాస.." ఇలా సాగే ఈ పుస్తకం గురించి రచయిత మాటల్లోనే - "నిన్నటి దాకా ఆమె నా జీవితం ..ఇప్పుడు తానొక జ్ఞాపకం..- ఈ అక్షరాలలో ఆమె ఆత్మ వున్నది ..ఈ పదాలలో ఆమె ఆర్తి ఉన్నది..ఈ కావ్యంలో ఆమె కీర్తి ఉన్నది. మనసుకి మరణం లేదు ఆమె నన్ను వీడిపోనే లేదు. ఆమె ఒక అక్షరం, ఆమె ఒక అద్భుతం, ఆమె ఒక ఔన్నత్యం, ఆమె నా జీవన జీవం..నా జీవనరాజీవం..అందుకే ఈ కావ్యం ఆమే ఈ కావ్యం.." ***




*Varanasi Publications*

*303, Edaikode Towers*

*Srinagar Colony*

*Hyderabad – 500 073*

*Phone: 040-2373 2745*

**వారణాసి నాగలక్ష్మి గారు** కవయిత్రి, కథా రచయిత్రి, చిత్రకారిణి. గేయాలు వ్రాయడంలో ఎంత లాలిత్యం చూపిస్తారో కథా రచనలో అంత సున్నితత్వం ప్రదర్శిస్తారు. మనచుట్టూ తిరిగే మనుషులూ, మనందరం ఎప్పుడో ఎదుర్కొన్న సంఘటనలూ..ఇవే ఈ కథలన్నీ. ఐతే వాటి అన్వయం, వాటిల్లోంచి మనం గ్రహించదగిన జీవిత పాఠం..వీటిని కన్విన్సింగ్‌గా చెప్పడమే రచయిత్రి గొప్పదనం. వీరి కథలు ఎందుకిలా మనిషితనంతో మట్టివాసనతో నిండి ఉంటాయో ఆమె మాటల్లోనే తెలుసుకుందాం.. "అంతులేని ఆకాశం.. నీలంగా, ఎగిరే కొంగలూ, ఎండలో మబ్బులూ తెల్లగా, మిరపచేలూ, కారబ్బంతి తోటలూ....... ఆస్వాదిస్తూ, రైతు జీవితంలోని వ్యధలూ, వేదనలూ, ఉమ్మడి కుటుంబాల్లోని అనురాగాలూ, ఆప్యాయతలూ, స్వార్థాలూ, అపార్థాలూ అర్థం చేసుకునేందుకు ప్రయత్నిస్తుంటే కలిగింది ఏదైనా రాయాలనే తపన". ఈ కథల్లోని మొదటి కథ `ఆలంబన` లోనే సహచరి దూరం కాగా, సంతానం విదేశాల్లో ఉంటే మిగిలిన ఒంటరి జీవితాన్ని అర్థవంతంగా తీర్చి దిద్దుకున్న ఒక రామశాస్త్రి గారి కథని హృదయంగమంగా చిత్రించారు. మిగతా కథల్లో కూడా అనుకూల దాంపత్యాల గురించీ, ఆదర్శవివాహాల గురించీ, అత్తింటి కాపురాల గురించీ, పిల్లల పెంపకం గురించీ..ఇలా అన్నీ కుటుంబ సంబంధాల గురించిన వస్తువులనే స్పృశించారు. ఈ కథలన్నీ చదవడం ముగించగానే ఒక్కసారి పుట్టిన పల్లెటూరు వెళ్ళివచ్చినట్లుంటుంది. ***

ఈ శీర్షికలో తమ పుస్తక పరిచయాలు ప్రచురింపబడాలనుకునే వారు, తమ పుస్తకాలు ఒక్కొక్క కాపీని క్రింది ఎడ్రసుకి మెయిల్ చెయ్యవలసిందిగా `కౌముది` విజ్ఞప్తి చేస్తోంది.

Editor
KOUMUDI(Web Monthly)
4251 Escudo Ct
Dublin, CA 94568,USA